# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 08-02-2026** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఉగ్రవాదంపై భారత్ రాజీపడదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పునరుద్ఘాటించారు**

2. **కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ద్వారా ఆంధ్రప్రదేశ్ కు లబ్ధి చేకూరుతోందని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు.**

3. **ఆర్కిటెక్చర్ అంటే కట్టడాలు మాత్రమే కాదని.. అది మన నాగరికత, సంస్కృతికి ప్రతిబింబమని ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర చెప్పారు.**

4. **ప్రతి ఒక్కరు రోజు విధిగా వ్యాయామం చేయడం అలవరచుకోవాలని ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) చైర్మన్ అనిమిని రవి నాయుడు తెలిపారు.**

=========================

ఉగ్రవాదంపై భారత్ రాజీపడదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పునరుద్ఘాటించారు. మలేషియా పర్యటనలో భాగంగా ఆ దేశ ప్రధాని అన్వర్ ఇబ్రహీంతో ఆయన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా రక్షణ, జాతీయ భద్రత, సెమీ కండక్టర్లు, వాణిజ్యం సహా పలు అంశాలపై సమావేశంలో చర్చించారు. ఇంధనం, మౌలిక సదుపాయాలు, తయారీ రంగం, డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో భారత్, మలేషియా దేశాల భాగస్వామ్యం వేగంగా పెరుగుతోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొంటూ..

.. వాయిస్.. 30 సెకన్లు

-------------------------

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశంలోని విద్యార్థులతో ప్రత్యక్షంగా సంభాషించే "పరీక్షా పే చర్చా" 9వ సంచిక రెండవ భాగం రేపు ఉదయం 10 గంటలకు ప్రసారం కానుంది. జాతీయ విద్యా విధానం 2020కి అనుగుణంగా ఒత్తిడి లేని పరీక్షల ప్రాముఖ్యతను గురించి ప్రస్తావిస్తూ... పరీక్షలలో సవాళ్లను అధిగమించడం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవడం వంటి వివిధ అంశాలను ప్రధానమంత్రి విద్యార్థులతో సంభాషిస్తారు. ఈ కార్యక్రమం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ యూట్యూబ్ ఛానెల్, ఆకాశవాణి, దూరదర్శన్ లతో పాటు విద్యా మంత్రిత్వ శాఖ సామాజిక మాధ్యమాలలోనూ ప్రసారం అవుతుంది.

-------------------------

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ద్వారా ఆంధ్రప్రదేశ్ కు లబ్ధి చేకూరుతోందని కేంద్ర గ్రామీణాభివృద్ధి కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. విశాఖపట్నంలో కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అంశాలను ఆయన ప్రస్తావించారు. ఆంధ్రప్రదేశ్ లోని రైల్వే ప్రాజెక్టులకు 10 వేల కోట్ల రూపాయలు కేటాయించినట్లు కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలియజేస్తూ..

.. వాయిస్.. 30 సెకన్లు

---------------------------

ఆర్కిటెక్చర్ అంటే కట్టడాలు మాత్రమే కాదని.. అది మన నాగరికత, సంస్కృతికి ప్రతిబింబమని ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. గత రాత్రి రాజస్థాన్‌లో నిర్వహించిన జైపూర్ ఆర్కిటెక్చర్ ఫెస్టివల్-2026 ముగింపు సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. "రాజస్థాన్‌లోని చారిత్రిక కోటలు, రాజభవనాలు మొదలుకొని రాష్ట్రంలోని పురాతన దేవాలయాల వరకు భారత నిర్మాణశైలి ప్రకృతితో మానవుడికి ఉన్న సంబంధాన్ని తెలియజేస్తుందని చెప్పారు. ప్రపంచంలోనే అత్యుత్తమ సహజ శిలలు భారత దేశంలో ఉన్నాయని.. ఆంధ్రప్రదేశ్ లోని ఉమ్మడి ప్రకాశం, చిత్తూరు, అనంతపురం, వైఎస్సార్ కడప జిల్లాల్లో అత్యంత నాణ్యమైన గ్రానైట్ లభిస్తుందని వెల్లడించారు.

---------------------------

ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడమే ప్రభుత్వ ధ్యేయమని వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. శ్రీకాకుళం జిల్లా నిమ్మాడలోని క్యాంపు కార్యాలయంలో పంచాయతీ రాజ్, జలవనరుల శాఖల అధికారులతో ఆయన నిన్న సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించిన పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. మార్చి నెలాఖరులోగా అన్ని పనులను పూర్తి చేయాలన్నారు. అన్ని గ్రామంల్లోనూ సిమెంటు రోడ్లు, పక్కా డ్రైన్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు. నాణ్యతా ప్రమాణాల విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడే ప్రసక్తే లేదని మంత్రి స్పష్టం చేశారు.

---------------------------

గిరిజన, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పేర్కొన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ ప్రధాన రహదారి నిర్మాణానికి మంత్రి నిన్న శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలు పెంపొందించే లక్ష్యంలో ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ప్రతి గ్రామాన్ని ప్రధాన రహదారులతో అనుసంధానిస్తున్నట్లు తెలిపారు. సాలూరు నుండి మక్కువ రహదారికి 18 కోట్ల రూపాయలు, మక్కువ మండలంలో మొత్తం 31 రహదారుల నిర్మాణానికి మరో 18 కోట్ల రూపాయలను మంజూరు చేసినట్లు మంత్రి వెల్లడించారు.

---------------------------

విజయవాడ గుణదల మేరీమాత ఉత్సవాలు రేపటి నుంచి ప్రారంభంకానున్నాయని విజయవాడ కాథలిక్ పీఠం బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు

చేసినట్లు ఆయన చెప్పారు. బిషప్ గ్రాసీ ప్రాంగణంలో ప్రత్యేక ప్రార్థనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. అన్ని ప్రభుత్వ శాఖల సహకారంతో ఉత్సవాలను సమర్థవంతంగా నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు.

----------------------------

అనారోగ్యంతో బాధపడుతున్న ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ ఎఫ్) అండగా ఉందని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను ఆమె లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సీఎంఆర్ ఎఫ్ ద్వారా ప్రజలకు సకాలంలో ఆర్థిక సహాయం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. వివిధ అనారోగ్య కారణాల కారణంగా ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందిన బాధితులను ఆదుకునేందుకు సీఎంఆర్ ఎఫ్ కింద ప్రభుత్వ సహాయం అందిస్తోందని చెప్పారు.

----------------------------

వందేమాతరం జాతీయ గీతం 150 సంవత్సరాల వేడుకలు పురస్కరించుకుని యువతలో జాతీయతాభావనను పెంపొందించేందుకు సెంట్రల్ ఇండస్ట్రి యల్ సెక్యూరిటీ ఫోర్స్ ఆధ్వర్యంలో తూర్పు తీరం వెంబడి సైక్లోథా న్ ర్యాలీని ప్రారంభించారు. గత నెలలో పశ్చిమ బెంగాల్ లో భక్కాలి తీరం నుంచి ప్రారంభమైన సైక్లోథా న్ ర్యాలీ ఒడిశా, శ్రీకాకుళం, విశాఖల మీదుగా... కాకినాడ జిల్లా ఉప్పాడ తీరప్రాంతానికి నిన్న సాయంత్రం చేరుకొంది. ఈ సందర్భంగా ఉప్పాడలో జరిగిన సమావేశంలో యువకులు మాట్లాడుతూ.. మత్స్య కారులు సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని, అపరిచిత వ్యక్తులు తారసపడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అవగాహన కల్పించినట్లు తెలిపారు.

----------------------------

ప్రతి ఒక్కరు రోజు విధిగా వ్యాయామం అలవాటుగా చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ఛైర్మన్ అనిమిని రవి నాయుడు తెలిపారు. తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ యూనిఫెస్ట్-2026 స్పోర్ట్స్ డే కార్యక్రమాన్ని ఆయన ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా శాప్ ఛైర్మన్ మాట్లాడుతూ.. మానసిక, శారీరక ఆనందానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు.

----------------------------

ఈరోజు భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ విద్యావేత్త, భారతరత్న డాక్టర్ జాకిర్ హుస్సేన్ జయంతి. ఈ సందర్భంగా దేశానికి ఆయన చేసిన సేవలను ప్రజలు స్మరించుకుంటున్నారు. 1897 ఫిబ్రవరి 8వ తేదీన హైదరాబాద్‌లో జన్మించిన ఆయన... 1967 మే 13వ తేదీ నుండి 1969 మే 3వ తేదీ వరకు దేశానికి మూడవ రాష్ట్రపతిగా వ్యవహరించారు. అలాగే స్వతంత్ర్య భారతదేశ రెండవ ఉపరాష్ట్రపతిగా, బీహార్ గవర్నర్‌గా కూడా సేవలందించారు. దేశానికి ఈ మహనీయుడు చేసిన సేవలకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం ఆయనను భారతరత్న పురస్కారంతో సత్కరించింది.

----------------------------

హజ్ యాత్రకు దరఖాస్తు చేసిన వారికి ఆరోగ్య పరీక్షలు, వ్యాక్సినేషన్ ఇచ్చేందుకు ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నిన్నటి నుంచి ప్రారంభించినట్లు వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ వీరపాండియన్ తెలిపారు. ఆరోగ్య పరీక్షల్లో పూర్తి ఆరోగ్యంగా ఉన్నవారికే మాత్రమే వ్యాక్సినేషన్ ఇస్తారని ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రం నుంచి హజ్ కు వెళ్లేందుకు సుమారు 2 వేల మంది వరకూ దరఖాస్తు చేసుకున్నారు. విశాఖపట్నం, కాకినాడ, తూర్పుగోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, శ్రీసత్యసాయి, ప్రకాశం, చిత్తూరు, తిరుపతి, అనంతపురం, కర్నూలు, నెల్లూరు, అన్నమయ్య, కడప, నంద్యాల ఆసుపత్రుల్లో ఈ వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. రేపటి వరకు ఈ శిబిరాలు కొనసాగుతాయని తెలిపారు.

======================